తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

శుక్రవారం
13 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

యాసంగిలో వరి సాగు చేయవద్దు

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

- ఎస్సారెస్పీ నుంచి యాసంగి సాగుకు నీటి విడుదల సాధ్యం కాదు
- ఒక ఎకరం వరి సాగు చేసే నీటితో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయవచ్చు
- యాసంగి పంట సాగుపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి,నవంబర్ 12(జనంసాక్షి) :
జిల్లాలో లోటు వర్షపాతం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులో తక్కువ నీటిమట్టం కారణంగా యాసంగి పంటకు సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని, రైతులందరూ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సూచించారు.గురువారం సమీక్షిత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో యాసంగి పంట సాగుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత వర్షాకాలంలో తక్కువ వర్షపాతం నమోదైన కారణంగా జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో వరద ప్రవాహాలు రాకపోవడంతో నీటిమట్టం తక్కువగా ఉందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుందని పేర్కొన్నారు. యాసంగి పంట సాగుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్సారెస్పీ నుంచి సాగునీరు విడుదల చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, రాష్ట్రంలో జలవిద్యుత్ ఉత్పత్తి లేకపోవడంతో భవిష్యత్తులో విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు.ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేస్తే నీటి కొరతతో పాటు విద్యుత్ సమస్యలు ఎదురై పంట చివరి దశలో ఎండిపోయే ప్రమాదం ఉందని, తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఒక ఎకరం వరి పంట సాగుకు అవసరమయ్యే నీటితో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయవచ్చని తెలిపారు. రైతులందరూ వరికి బదులుగా మొక్కజొన్నతో పాటు ఇతర ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి రైతు వేదికలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న పంటల అవకాశాలను రైతులకు వివరించాలని సూచించారు.జిల్లాలో యాసంగి సాగు ప్రణాళికను నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించాలని, రైతులందరూ వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటల సాగును చేపట్టేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి



ఇందల్వాయి(జనం సాక్షి) నవంబర్. 12
ఇందల్వాయి మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో క్లస్టర్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్ ప్రారంభించారుపాఠశాల అభివృద్ధికి రూ.6 కోట్లు, ప్రాంత అభివృద్ధికి రూ.11 కోట్లు కేటాయింపు విద్యార్థుల కోసం నాలుగు ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తా విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా తదితర అన్ని రంగాల్లో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని అంశాలకే పరిమితం కాకుండా సమాజంతో మమేకమై తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు.గురువారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాంస్కృతిక, సాహిత్య, క్రీడా రంగాల్లో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లో **వార్తా లోపలి పేజీలో**

పిల్లలను రోజు కేంద్రాలకు పంపాలి: కలెక్టర్

- అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి
- అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 12(జనంసాక్షి);
అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.
తంగళ్లపల్లి మండలం పద్మనగర్ అంగన్వాడీ కేంద్ర నిర్మాణ పనులు పూర్తికాగా, గురువారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. అంగన్వాడి కేంద్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని కొనియాడారు,సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి,అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు. వారికి బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.(ప్రతి



మంగళవారం 10 నిమిషాలు) కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు.కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ మోర నిర్మల, తంగళ్ళపల్లి సర్పంచ్ మోర లక్ష్మీరాజం, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

సకాలంలో నిర్మాణాలు చేపట్టకుంటే రద్దు చేస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి స్పష్టీకరణ

గన్నేరువరం, నవంబర్ 12 (జనంసాక్షి):
నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.



గురువారం గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 85 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ వారి సొంతింటి కలను నెరవేరుస్తున్నామని తెలిపారు. మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరుపుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం దశలవారీగా విడుదల చేసే బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. గన్నేరువరం మండల వ్యాప్తంగా మొత్తం 332 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 254 మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారని ఎమ్మెల్యే వివరించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను గడువులోగా ప్రారంభించకపోతే ఆ అనుమతులను రద్దు చేసి ఇతర అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల వద్ద నిర్మాణానికి అవసరమైన డబ్బులు లేకపోయినా, మహిళా సంఘాల ద్వారా రూ.2 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అయితే తీసుకున్న రుణాన్ని



నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి

డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)

రామగిరి జనంసాక్షి:

నిర్దేశించిన బొగ్గు, ఓబి ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) శ్రీ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు.వారు గురువారం సింగరేణి రామగుండం-3 ఏరియా లోని ఓసిపి-1 ఉపరితల గనిని సందర్శించి వ్యూ పాయింట్ నుండి నడుస్తున్న పనులను పరిశీలించారు.వారికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు స్వాగతం పలికారు. అనంతరం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం -2 ఏరియా జనరల్ మేనేజర్ టి.లక్ష్మీపతి గౌడ్ లతో పాటు ఇతర అధికారులతో జియం కార్యాలయం నందు సమీక్ష నిర్వహించి బొగ్గు, ఓబి ఉత్పత్తి, ఉత్పాదక, రవాణా, జిడికె-10 గని పనుల పురోగతి, మొదలగు అంశాలపై చర్చించి, ఓసిపి-1, ఓసిపి-2, ఓసిపి-3, ఉపరితల గనులలో, వకీల్ పల్లి భూగర్భ గనిలో నడుస్తున్న విస్తరణ పనులను, యంత్రాల పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్ గారు మాట్లాడుతూ నిర్దేశించిన ఓ.బి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సమిష్టి కృషితో సాధించాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్వోటు జియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, జె.రాజశేఖర్, వకీల్ పల్లి గని ఏజెంట్ నెహ్రూ, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జ్ఞాన సంబంధం, ప్రకాష్, ఐ ఇ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, మేనేజర్ రావుల పాపయ్య, ఏరియా సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్, సర్వే అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు

పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి

రామగిరి, నవంబరు 12, (జనంసాక్షి) :

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, గోదావరిఖని 2 టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లల భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విద్యార్థులు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి మడత రమేష్ లు మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, ఒక్కసారి బానిస అయితే ఆరోగ్యం, చదువు, కుటుంబం దెబ్బతింటాయని అన్నారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్ లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని 2 టౌన్ సీఐ ఎన్. ప్రసాదరావు, ఎస్సై ఎన్. లక్ష్మణ్, చందనాపూర్, జల్లారం సర్పంచ్ లు కొండ మంజుల-శ్రీనివాస్, జుల యమున-శ్రీనివాస్, ఉప సర్పంచ్ చిగురు రజిత రామచందర్, స్కూల్ ప్రిన్సిపాల్ మేడి లక్ష్మి, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు సుమారు 200 మంది పాల్గొన్నారు.





గుండ్లపల్లి - పొత్తూరు రోడ్డు పనులు వేగవంతం చేయాలి

తిరిగి ప్రారంభమైన నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం, నవంబర్ 12 (జనంసాక్షి):

గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి - పొత్తూరు మార్గంలో నిలిచిపోయిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడంతో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం గనుకుల కొండాపూర్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ తిరిగి పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ ఉత్సాహంగా పనులను పునఃప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, ప్రజలకు త్వరితగతిన రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చేలా పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

సకాలంలో నిర్మాణాలు చేపట్టకుంటే రద్దు చేస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి స్పష్టీకరణ

తిరిగి చెల్లించగలమనే నమ్మకాన్ని మహిళా సంఘాలకు కల్పించాల్సిన బాధ్యత లబ్ధిదారులపైనే ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఎలాంటి పైరవీలకు తావులేదని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలదే కీలక బాధ్యత అని పేర్కొన్నారు. ఇళ్ల మంజూరు కోసం ఎవరూ ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.అనంతరం గన్నేరువరం గ్రామానికి సంబంధించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఇళ్లు కేటాయించారు. తదుపరి మండలానికి సంబంధించిన ఏడుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాతంగి శిరీష, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ఇప్ప నరేందర్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కటకం తిరుపతి, సర్పంచులు రంగనవేని లచ్చినర్సు,హరికొంతం గోపాల్ రెడ్డి, ఆకుల కవిత, చింతల ఉమారాణి, కాల్వ పద్మ,కర్నె చంద్రయ్య, గడ్డం రమ్య,మాదరి శ్రీనివాస్, రేపాక బాణవ్వ, జంగిటి ప్రకాష్, నందికొండ అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాతంగి అనిల్, చిట్కూరి అనంతరెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, అయిలయ్య, చింతల శ్రీధర్ రెడ్డి, తిరుపతిగౌడ్, కూన చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్‌ను సందర్శించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు కిరణ్ కుమార్

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

కరీంనగర్ లీగల్, నవంబర్ 12 (జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికై, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా నియమితులైన కిరణ్ కుమార్ తొలిసారిగా కరీంనగర్ బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, జిల్లాకు మంజూరైన నూతన కోర్టులను త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, తన పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, న్యాయవాదుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బార్



అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ చంద్రపాటి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు బండ శివకుమార్, జాయింట్ సెక్రటరీ సుంకే దేవకిషన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్, ట్రెజరర్ బొజ్జ స్వామి, సీనియర్ న్యాయవాదులు మధుసూదన్ రావు, రఘునందన్ రావు, ఎర్రం రాజారెడ్డి, లింగంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

20 రోజులుగా యార్డులో ధాన్యం పోసినా కొనుగోళ్లు ప్రారంభించని ప్రభుత్వం

- వెంటనే కాంటాలు పెట్టి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్

మంథని, నవంబర్ 12, (జనంసాక్షి) :

రైతులు పండించిన పంట అమ్మించడానికి కాంటాలు పెట్టించడంలో పాలకులు చూపించాల్సిన శ్రద్ధ చూపించడం లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. గురువారం పెద్దపల్లి జిల్లా మంథని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. మార్కెట్ యార్డు సెక్రటరీతో ఫోన్ లో మాట్లాడి వెంటనే కాంటాలు పెట్టి కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులుగా ఎదురుచూస్తున్నారని, అయినా ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించలేదని అన్నారు. కొనుగోళ్లు పట్టించుకోకుండా రైతులు ప్రైవేటు వాళ్లకు అమ్ముకుంటున్నారని ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరమని, ఇది రైతులను దళారులకు అమ్ముకోమని ప్రోత్సహించినట్లే ఉందని ఎద్దేవా చేశారు. మార్కెట్ యార్డు సెక్రటరీ, పాలకవర్గం కూడా యార్డుకు రాకపోవడం రైతులపై వారికి ఉన్న ప్రేమను తెలియజేస్తోందని, తుఫాన్ వస్తే రైతుల పరిస్థితి ఏంటనే ఆలోచన లేదని అన్నారు. సెక్రటరీ మరో రెండు రోజుల్లో కాంటాలు పెడుతామని చెబుతున్నా తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మండల స్థాయి వ్యాసరచన పోటీలు

గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) :

బుధవారం రోజు హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్య ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) మండల విద్యాధికారి కె. రాములు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్ నీమ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయు రాలు మాట్లాడుతూ... విద్య నిజమైన బలమని, జ్ఞానార్జన ద్వారా దేశ పురోగతికి, సమాజాభివృద్ధికి కృషి చేయవచ్చని తెలిపారు. విద్యార్థులకు చదివే ముఖ్యమని నేడు బాగా చదివిన విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉంటాడని, విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు



మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. తదుపరి ఉపాధ్యాయ బృందం విద్య ప్రాముఖ్యత వివరిస్తూ, మధురమ్మ ట్రస్ట్ వారు మండల స్థాయిలో మంచి కార్యక్రమం నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. అనంతరము ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ... మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా 2011 సంవత్సరం నుండి ప్రభుత్వ సెక్టార్ల లోని విద్యార్థులకు, సమాజంలోని పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశ నాయకుల జయంతి, వర్ధంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తూ వారి ఆశయాలను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొనుటకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. అనంతరం మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన మొదటి ఇద్దరు విద్యార్థులు ఎం.రచన జిల్లా పరిషత్ హై స్కూల్ ఇల్లందకుంట, పి. నాగలక్ష్మి కేజీబీవీ, ఇల్లందకుంట లకు శంకర్ నారాయణ డిక్షనరీ, షీల్డ్ లను కన్సోలేషన్ ప్రైజులుగా బి. రక్షిత, ఎం. అక్షయ్, ఎం. సహస్ర, కె. రితిక్, డి. కావ్యశ్రీ, బి. నితిన్, ఎం.అక్షయ్, డి. రితిక లకు శంకర్ నారాయణ డిక్షనరీలు అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు ఎస్. అనసూ య. ప్రేమ్ రాజు, కె. జయప్రకాష్, సిహెచ్ వేణు, కె.సత్యం, జె.రాధికా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నలందా హైస్కూల్‌లో నేడు మాక్ ఎన్నికలు

ఆర్మూర్,నవంబర్12(జనంసాక్షి):

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో గల నలందా హైస్కూల్‌లో నేడు మాక్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలను పూర్తిగా విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం ను వినియోగించనున్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అమూల్యమైన ఓటు హక్కు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు,ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ,ఎన్నికల విధివిధానాల ప్రకారం మాక్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ



కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల



విధానం,ఓటు హక్కు వినియోగంపై ప్రత్యక్ష అవగాహన కలగనుంది.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి): వానాకాలం 2026-27 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎఫ్‌ఏక్యూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్‌లలో నమోదు చేయడంతో పాటు ప్రక్రియలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధరను సకాలంలో చెల్లించేలా చూడాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్



ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వికృర్, ఎన్‌వై గిరి, డీఎం శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, డీఆర్డీవో దామోదర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు శాన్వి విద్యార్థిని

విద్యార్థిని అభినందించిన సాన్వి కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) :

ఈ నెల 18వ తేదీ నుంచి చండీగఢ్లో జరిగే ఎస్ జి ఎఫ్ అండర్ 19 సాఫ్ట్ బాల్ జాతీయ క్రీడలకు తెలంగాణ తరపున కరీంనగర్ రేకుర్తి సాన్విజూనియర్ కళాశాలకు చెందిన కట్కూరి తేజాని ఎంపికైనట్లు జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి బన్సీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థిని కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ తో కలిసి ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ బన్సీలాల్ ఘనంగా సన్మానించారు. సాన్వి కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడల్లో మరింత కష్టపడి జాతీయస్థాయిలో మరిన్ని పథకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్, రత్నాకర్, కోచ్ లు నవ్య, కొప్పుల గంగాధర్, లక్ష్మణరావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) :

శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలోని శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ అండర్ -19 తైక్వాండో విభాగంలో వాసరి హారిక, కల్వ రోషిణి ఎంపిక కాగా, కబడ్డీ విభాగంలో ఎర్రవెల్లి అభినయశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు సంస్థకు గర్వకారణంగా నిలిచాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి విద్యార్థులను అభినందించి, ఘనంగా సత్కరించారు. క్రీడలతో పాటు విద్యార్థులు విద్యా, క్రీడా రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో మరిన్ని విజయాలు సాధించి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్య రెడ్డి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, డిఫెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, ఫిజికల్ అడ్వైజర్ లెంకల మహిపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

బాధిత కుటుంబని పరామర్శించిన మానాల మోహన్ రెడ్డి

జలాల్పూర్ న్యూస్ 12 నవంబర్ (జనం సాక్షి)

బాల్కొండ మండలం జాలాల్ పూర్ గ్రామంలో ఇటీవల పరమాపదించిన గుడేటి బుమ్మవ మరియు అవట్ల మల్కానా గారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు కుటుంబ సభ్యులకి దేవుడు మనోధైర్యంతో ప్రసాదించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో రిటైడ్ ఏ ఈ డి లక్ష్మణ్ నాయక్ బాల్కొండ మండల ప్రెసిడెంట్ ప్రవీణ్ గారు మాజీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ గారు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రవి గారు కిషన్ గారు జాలాల్ పూర్ సర్పంచ్ మోహన్ రెడ్డి ఇత్వర్ పేట్ సర్పంచ్ సంతోష్ బస్సపూర్ సర్పంచ్ శ్రీనివాస్ ఉప సర్పంచ్ బొజ్జన సంజీవ్ రెడ్డి శ్రీనివాస్ గంగాధర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకంతో మరోసారి సత్ఫలితాలు

- సివిల్స్ తుది ఇంటర్వ్యూకు 31 మంది ఎంపిక
- ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు మరోసారి
- ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం
- అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క అభినందనలు
- సింగరేణి భవన్, నవంబర్ 12, 2026

రామగిరి జనంసాక్షి:

తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు.మెయిన్స్ కు ఎంపికైన 158 మందికి రూ. లక్ష చొప్పున ప్రోత్సాహకంసింగరేణి సంస్థ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేందుకు రెండు నెలల క్రితం దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చిన దరఖాస్తుల్లో 158 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ. 1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించింది. ఈసారి ప్రోత్సాహక మొత్తాలను నేరుగా అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేశారు. ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం.ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకంతుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది.అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి అభినందనలుసివిల్స్ మెయిన్స్ లో ఉత్తీర్ణులై తుది ఇంటర్వ్యూకు ఎంపికైన తెలంగాణ బిడ్డలందరికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులందరూ తుది పరీక్షలోనూ విజయం సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇప్పటికే 27 మందికి సివిల్స్ లో విజయంరాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ గత రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (ఆూఖీ) నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది 20 మంది చొప్పున మొత్తం 27 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం విశేషం.ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని, ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నారని, ఈ మాక్ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ తన సహకారాన్ని అందిస్తుందని సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు.వరంగల్ నుంచి అత్యధికంగా ఆరుగురుఈ ఏడాది తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందిలో అత్యధికంగా వరంగల్ జిల్లా నుంచి ఆరుగురు ఉన్నారు. మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముగ్గురేసి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున ఎంపికయ్యారు. అదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరిలో 18 మంది ఓబీసీ వర్గాలకు చెందిన వారున్నారు. ఎస్టీ అభ్యర్థులు ఇద్దరు, ఎస్సీ అభ్యర్థులు ముగ్గురు, 8 మంది జనరల్ అభ్యర్థులు ఉన్నారు.



ఎన్నికల అవగాహనపై వ్యాసరచన,క్విజ్ పోటీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి)

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలు మరియు కళాశాలలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు గురువారం వ్యాసరచన మరియు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ ఆర్డిఓ కేబిఎస్ కుమారి మాట్లాడుతూ ఈ పోటీలలో నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 128 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో వ్యాసరచన పోటీ నుండి 10 మందిని, క్విజ్ పోటీ నుండి 10 మందిని ఎంపిక చేసి, మొత్తం 20 మంది విద్యార్థులను జిల్లా స్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమానికి పంపించడం జరుగుతుందన్నారు.విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యత మరియు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆమె వెంట జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, మండలాల విద్యాధికారులు బాణాల సదానందం,లొకిని కిషన్,రామకృష్ణ,నోడల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.



పబ్లిక్ ప్రాసీక్యూటర్ గా సమర్థవంతమైన సేవలు

గడ్డం లక్ష్మణ్‌కు సీపీ గౌస్ ఆలం సన్మానం

కరీంనగర్ లీగల్, నవంబర్ 12 (జనంసాక్షి)

భార్య వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడైన భర్త న్యాల సంపత్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కాసమాల సాయికిరణ్ గత గురువారం తీర్పు వెలువరించారు.చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన రాగుల మమతకు 2007లో పర్లపల్లికి చెందిన న్యాల సంపత్‌తో వివాహమైంది. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చి, హైదరాబాద్‌లో స్క్రాప్ వ్యాపారం కూడా ఏర్పాటు చేశారు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో అదనపు కట్నం కోసం మమతను వేధించడంతో పాటు, పిల్లలు కలగడం లేదని మానసికంగా హింసించేవాడు.ఈ వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన మమత 2020 అక్టోబర్ 21న ఒంటిపై నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వాంగ్మూలం ఇచ్చిన 20 రోజుల అనంతరం మృతి చెందింది. ఆమె తండ్రి ఫిర్యాదుతో ఎల్ఎండీ పోలీసులు భర్త సంపత్, అతని తల్లి లక్ష్మిపై కేసు నమోదు చేశారు.అప్పటి ట్రైనీ ఐపీఎస్ అధికారి రష్మీ పెరుమాళ్ దర్యాప్తు చేపట్టగా, సీడీఓ టి. శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్, ఏఆర్ శ్రీనివాసులు సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి సంపత్‌పై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రస్తుత కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్‌ను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున ఆయన అందించిన సేవలను సీపీ అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక మండల అధ్యక్షుడిగా అందే స్వామి ఎన్నిక

ప్రధాన కార్యదర్శిగా బడుకోలు దేవేందర్ రెడ్డి.. ఉపాధ్యక్షులుగా అందే సురేష్..

చిగురుమామిడి నవంబర్ 12(జనంసాక్షి):

భారత రాజ్యాంగ విలువల పరిరక్షణ,ప్రజల్లో చైతన్యం కలిగించే లక్ష్యంతో రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక చిగురుమామిడి మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల కార్యక్రమానికి పరిశీలకులుగా కవ్వ లక్ష్మారెడ్డి,చికోటి రమణయ్య,మేకల వీరన్న యాదవ్,హుస్నాబాద్ కౌన్సిలర్ గాదెపాక రవీందర్ లు హాజరై కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు.నూతనంగా ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షులుగా మాజీ జెడ్పిటిసి అందె స్వామి,ప్రధాన కార్యదర్శిగా బడుకోలు దేవేందర్ రెడ్డి, కోఆర్డినేటర్‌గా రామోజు కృష్ణమాచారిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వీరితో పాటు ఉపాధ్యక్షులుగా అందె సురేష్, మామిడి అంజయ్య,నాగేల్లి లక్ష్మా రెడ్డి, ఎనగందుల శ్రావణ్ కుమార్,గడ్డం తిరుపతి రెడ్డిలు నియమితులయ్యారు.అలాగే, కమిటీ కార్యదర్శులుగా బుర్ర పర్శరాములు గౌడ్,పూల లచ్చిరెడ్డి, అనుమోజు జనార్దన్, పింగళి సంపత్ రెడ్డి, ఎనగందుల రాజు, వంతడుపుల దిలీప్ కుమార్, సిరవేని సంపత్ కుమార్, దొబ్బల బాబులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గడ్డం అనిల్, గుడిసె మల్లిఖార్జున్, కత్తుల ప్రవీణ్, మంద ఎల్లయ్య, ఎ. బాలకృష్ణ చారిలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అందె స్వామి, ప్రధాన కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో రాజ్యాంగ హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి, సామాజిక న్యాయం కోసం వేదిక తరపున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పరిశీలకులకు, సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్, కాటం సంపత్ రెడ్డి,సాంబారి భారతమ్మ కొమురయ్య,గుళ్ళ రజిత రాజు,ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,నాయకులు సాంబారి బాబు, బొమ్మగాని పరశురాములు, ముద్రకోల రాజయ్య,అందే చిన్నస్వామి,గజ్జెల రాములు,జగన్,సిరవేణి సంపత్,దొబ్బల బాబు, పింగిలి సంపత్ రెడ్డి,కూరెళ్ళ కిషోర్, గట్టు శ్రీనివాస్,కొమురయ్య,గందె ప్రశాంత్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవ పరిరక్షణే ధ్యేయం

ప్రజా సమస్యలే ఎజెండాగా 'జాగో తెలంగాణ' యాత్ర

ఇంద్రవెల్లి నుంచి జోగులాంబ వరకు విక్రమ్ రెడ్డి మహా పాదయాత్ర

15 వేల కిలోమీటర్ల లక్ష్యంతో ప్రజల్లోకి వీర తెలంగాణ సమితి

జనం సాక్షి । తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక ఉన్న ఉద్యమ స్ఫూర్తి, ప్రజల ఆకాంక్షలు, ఆత్మగౌరవ భావనను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా వీర తెలంగాణ సమితి ఆధ్వర్యంలో విక్రమ్ రెడ్డి చేపట్టిన 'జాగో తెలంగాణ' యాత్ర రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోంది. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక ఐక్యత, రాజకీయ చైతన్యమే ప్రధాన అజెండాగా ఇంద్రవెల్లి నుంచి జోగులాంబ వరకు సుదీర్ఘ పాదయాత్ర, రోడ్‌షోలకు శ్రీకారం చుట్టారు.

15 వేల కిలోమీటర్ల యాత్రతో ప్రజల్లోకి..

సుమారు 15 వేల కిలోమీటర్ల మేర సాగనున్న ఈ యాత్రలో విక్రమ్ రెడ్డి గ్రామాలు, పట్టణాలు, వివిధ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుంటున్నారు. పాదయాత్రలు, రోడ్‌షోల ద్వారా తెలంగాణ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, రాష్ట్ర భవిష్యత్తుపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకుంటున్నారు. 45 రోజుల క్రితం ఇంద్రవెల్లిలో ప్రారంభమైన ఈ యాత్ర ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని సుమారు 15 నియోజకవర్గాల్లో పర్యటనను పూర్తి చేసుకుంది. వచ్చే ఫిబ్రవరి 11వ తేదీ వరకు కొనసాగి జోగులాంబ వద్ద ముగియనుంది.

తెలంగాణ ఆత్మగౌరవమే ప్రధాన అంశం..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో ప్రజలు ప్రదర్శించిన పోరాట



స్ఫూర్తి, త్యాగాలు, ఆకాంక్షలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్న భావనను ఈ యాత్ర ద్వారా ముందుకు తీసుకెళ్తున్నారు. రాష్ట్ర అస్తిత్వం, భాష, సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు వివరిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుతో ప్రజలు ఆశించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు సాధించేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమనే సందేశాన్ని వినిపిస్తున్నారు.

కులమతాలకు అతీతంగా సామాజిక ఐక్యతకు పిలుపు..

ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందే విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రాజకీయాలు కొందరి చేతుల్లోనే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు.

యువత, మహిళలు, రైతుల భాగస్వామ్యమే లక్ష్యం

యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించడం, మహిళలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడం, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని విక్రమ్ రెడ్డి వెల్లడించారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడమే కాకుండా వాటిపై సమాజంలో చర్చ జరిగేలా చేయడం, ప్రజల గొంతుకను రాజకీయ వేదికలపై వినిపించేలా ప్రోత్సహించడం తమ లక్ష్యమని తెలిపారు.

ప్రజా సమస్యలపై చైతన్యమే యాత్ర విజయానికి కొలమానం..

ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం, తెలంగాణ సమాజంలో రాజకీయ అవగాహన పెంపొందించడం, రాష్ట్ర అభివృద్ధిలో అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాల చుట్టూ 'జాగో తెలంగాణ' యాత్ర కొనసాగుతోంది. ఇంద్రవెల్లి నుంచి ప్రారంభమైన ఈ ప్రయాణం జోగులాంబ వరకు సాగనున్న నేపథ్యంలో తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, సామాజిక ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ యాత్ర ప్రధాన సందేశంగా నిలుస్తోంది.

గ్రామగ్రామాన బీజేపీ జెండా ఎగరాలి

కార్యకర్తలకు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి దిశానిర్దేశం



సిరికొండ, నవంబర్ 12 (జనంసాక్షి): సిరికొండ మండలంలోని ప్రతి గ్రామంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తూ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి పిలుపునిచ్చారు. సిరికొండ మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా దినేష్ కులచారి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, విధానాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను చురుగ్గా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. పార్టీ అభివృద్ధిలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని, నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను బలోపేతం చేస్తూ ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్టీ లక్ష్యాల సాధనకు అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి తూంపల్లి రాజు, సీనియర్ నాయకులు గోపి, ఉపాధ్యక్షులు మురళి, సతీష్, కార్తిక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, బీజేవైఎం అధ్యక్షుడు మధు, రంజిత్ రెడ్డి, ధర్మపురి, మారుతి, లింబాద్రి, వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శలు

మంథని, నవంబర్ 12, (జనంసాక్షి) :

మంథని మండలం సిద్దపల్లెలో కాలు ఫ్రాక్చర్ అయిన వేల్పుల తిరుపతిని, పాలకుర్తి జీడి నగర్ లో మాజీ సర్పంచ్ రావుల నారాయణ కుటుంబాన్ని, గోదావరిఖని మార్కండేయ కాలనీలో నాగపురి సంపత్ కుమార్ కుటుంబాన్ని, సుందిల్లలో బొగిరి మల్లమ్మ, మారం పెద్ద పోశయ్య, ఇరుగుల మల్లేష్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాలకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కల్చరల్, నవంబర్ 12 ,(జనం సాక్షి):

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కామినేని మధుసూదన్ సతీమణి సరిత మృతి పట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.గురువారం కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో ఉన్న వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఆయన వెంట కార్పొరేటర్లు ఒంటెల సత్యనారాయణరెడ్డి,బండారి వేణు,ప్రవీణ్‌రావు,హమ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ధనపురి సాగర్ తదితరులు ఉన్నారు.



జగదాంబ తండా, ముచ్చర్ల గ్రామాల్లో అదనంగా

100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం..

ఆనంద్ కుమార్

గంభీరావుపేట నవంబర్ 12 జనం సాక్షి

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం జగదాంబ తండా, ముచ్చర్ల గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరగడంతో ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడుతూ, తక్కువ వోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అదనంగా రెండు 100 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఛార్జింగ్ చేశారు.కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి రావడంతో పాత ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గడంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్, మెరుగైన వోల్టేజీ అందనుంది.ఈ కార్యక్రమం డీఈ అంజయ్య, ఏడీఈ రమేష్, నారాయణరావు ఏఈ ఆనంద్ కుమార్ రైతులు ఉన్నారు.

పేరుకే కొనుగోలు కేంద్రాల ప్రారంభం..

కొనుగోళ్లు మాత్రం శూన్యం!

ధాన్యం కొనుగోళ్లు లేక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు



గంభీరావుపేట, నవంబర్ 12, జనంసాక్షి:

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సుమారు 10 నుంచి 15 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇదే అదునుగా భావిస్తున్న దళారులు రైతుల వద్దకు వచ్చి క్వింటాల్‌కు రూ.2,600 చొప్పున ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ఒత్తిడి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగకపోవడంతో ధాన్యం నిల్వ ఉంచలేక దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ముస్తఫా నగర్ ఉపసర్పంచ్ శివంది దేవేందర్ డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

వరుస చోరీల వెనుక దొంగల గుట్టురట్టు.. పోలీసుల వలలో ఇద్దరు!

- 29.7 తులాల వెండి, 9.8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- మరో నిందితుడు పరారీ.. పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు
- బాన్సువాడలో చాకచక్యంగా కేసులను ఛేదించిన పోలీసులు



బాన్సువాడ నవంబర్ 12 (జనంసాక్షి)
బాన్సువాడ పట్టణంలో వరుసగా జరిగిన ఇళ్ల దొంగతనాల కేసులను పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడిన నిందితుల ఆచూకీని సాంకేతిక ఆధారాలతో గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 29.7 తులాల వెండి, 9.8 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉండటంతో అతని కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.బుధవారం బాన్సువాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ తుల శ్రీధర్ కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అక్టోబర్ 26న తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దొంగలు సుమారు 10 తులాల వెండి గొలుసులు, 16 తులాల వెండి కడియాలు, రూ. 2 వేల నగదును అపహరించారు. అదేవిధంగా నవంబర్ 4న హరిజనవాడలోని మరో ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.వరుస చోరీలతో అప్రమత్తమైన పోలీసులు బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి ప్రత్యేక దృష్టి సారించారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించడంతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బుధవారం బాన్సువాడ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విచారణలో నిందితుల ప్రమేయం బయటపడటంతో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో జాదవ్ రావ్ సందీప్ ఉన్నట్లు సీఐ వెల్లడించారు. మరో నిందితుడు షాదాబ్ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విలువైన ఆభరణాలు, నగదును ఇళ్లలో భద్రపరచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కేసులను ఛేదించడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ శిరీషతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం శ్రీ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా
తనిఖీ చేసిన అడిషనల్ డైరెక్టర్



సిరికొండ, నవంబర్ 12 జనంసాక్షి:
నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలను అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారి గురువారం ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వృత్తి విద్యా విభాగాలు, మౌలిక సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, బోధనాభ్యసన పద్ధతులు, విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా భ్యాసం, పాఠ్యాంశాలపై అవగాహన, నైపుణ్యా ల అభివృద్ధి, వృత్తి విద్య ప్రాధాన్యత వంటి అంశాలపై ప్రశ్నించారు. నేటి పోటీ ప్రపంచంలో పుస్తక పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలోని అన్ని విభాగాలను పరిశీలించిన అనంతరం నిర్వహణ, విద్యా కార్యక్రమాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, పాఠశాల మొత్తం పనితీరుపై అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని అంశాలు చక్కగా నిర్వహి స్తున్నారని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ పాఠశాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.ఈ సంద ర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం అమలు చేస్తున్న ప్రత్యేక కార్యా చరణలు, విద్యా, సహపాఠ్య కార్యక్రమాల వివరాలను అడిషనల్ డైరెక్టర్‌కు వివరిం చారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయ బృందం సమిష్టి కృషితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారి, ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవా రథం సేవలు అభినందనీయం

ప్రచార రథాన్ని ప్రారంభించిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

కామారెడ్డి నవంబర్ 12 (జనంసాక్షి)
సమాజ సేవే లక్ష్యంగా, ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు చేపడుతున్న అన్నపూర్ణ సేవా రథం కార్యక్రమం అభినందనీయమని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అన్నపూర్ణ సేవా రథం ప్రచార పత్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఈ సేవా కార్యక్రమం ఉద్దేశాలను తెలుసుకుని నిర్వాహకులను అభినందించారు.కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఈ సేవలను విస్తరించాలనే సంకల్పం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. కుటుంబంలో ఆప్తులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో అంత్యక్రియలకు హాజరయ్యే బంధుమిత్రులకు భోజన సదుపాయం కల్పించడం ద్వారా బాధిత కుటుంబాలపై కొంత భారాన్ని తగ్గించాలనే ఆలోచన గొప్పదన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అవసరమైన ప్రతి కుటుంబానికి ఈ సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగడం సంతోషకరమని తెలిపారు.సమాజంలో మానవత్వం, పరస్పర సహకారం, సేవాభావం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి కూడా సహకారం లభించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, డీసీసీ జనరల్ సెక్రటరీ జూలూరి సుధాకర్, తాటి ప్రసాద్, కామారెడ్డి మాజీ కౌన్సిలర్లు జమీల్, సలీం, చింతల రవీందర్ గౌడ్, చాట్ల వంశీ, పిడుగు సాయిబాబా, రంగా రమేష్ గౌడ్, కామారెడ్డి నియోజకవర్గ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ యూత్ అధ్యక్షుడు నర్సిల్ల మహేష్, సునీల్ గౌడ్, బండారి శ్రీకాంత్, అరవింద్, బల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి)
యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' అవగాహన పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను, భవిష్యత్తును నాశనం చేస్తుందని అన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉంటూ చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మాదకద్రవ్యాల నిర్మూలన ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేసినప్పుడే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి అలవాట్లు అలవర్చుకునేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర ఎం.సి. సభ్యుడు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు

కమాన్ పూర్, నవంబర్ 12, (జనంసాక్షి):

ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్నకు అండగా ఉండడమే కాకుండా రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలో గురువారం ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముల్కలపల్లి, కమాన్‌పూర్, సిద్ధిపల్లి, నాగారం, పెరపల్లి, గుండారం, రాజాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అలాగే సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తున్నదని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఐకెపి ఎపిఎం పద్మ, సీసీలు భిక్షపతి, మల్లయ్య, ఏఎంసి సెక్రటరీ సురేందర్, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, హమాలీలు, మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

విషాదంలోనూ ఇద్దరికి చూపునిచ్చిన కుటుంబం

- భర్తను కోల్పోయిన దుఃఖంలోనూ నేత్రదానానికి ముందుకొచ్చిన భార్య, తల్లి, పిల్లలు..

గోదావరిఖని, జనంసాక్షి :

ఇంటి పెద్దను కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ ఆ కుటుంబం మానవత్వాన్ని చాటుకుంది. తమకు తీరని విషాదం ఎదురైనా.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కోండ్ర సతీష్ (42) అనారోగ్యంతో చికిత్స పొందుతూ స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ఈనెల 2న మృతి చెందాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ అతడి కళ్లను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చి ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో గురువారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి నివాసంలో నేత్రదాత సతీష్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి అట్లూరి శశికళ, ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు మాట్లాడుతూ.. సతీష్ మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి కష్టకాలంలోనూ మృతుడి తల్లి కొమురమ్మ, భార్య లావణ్య, కుమారుడు లోకేష్, కుమార్తె సహస్ర మరో ఇద్దరికి చూపును ప్రసాదించాలనే గొప్ప నిర్ణయం తీసి సతీష్ నేత్రాలను దానం చేయడం అభినందనీయమన్నారు. వారి నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

చూపు కోల్పోయిన భార్యకు.. భర్త మరణం తీరని శోకం..

సతీష్ కుటుంబ పరిస్థితి మరింత హృదయ విదారకంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది క్రితం తలకు బలమైన గాయం కావడంతో భార్య లావణ్య రెండు కళ్ల చూపును కోల్పోయిందని



వివరించారు. ఇప్పటికే చూపు లేక ఇబ్బందులు పడుతున్న ఆమెకు ఇప్పుడు భర్త కూడా దూరం కావడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కంటిచూపు లేక పోవడం మరోవైపు జీవిత భాగస్వామిని కోల్పోవడంతో లావణ్య పడుతున్న వేదన కలచివేస్తోందన్నారు. సతీష్ అకాల మరణం పట్ల సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషాదంలోనూ నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోపాటు విద్యార్థులు క్రీడలలో రాణించాలి

బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

బోధన్, నవంబర్ 12 (జనంసాక్షి) :

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని విజయ మేరీ పాఠశాలలో మండల స్థాయి గ్రామీణ క్రీడా పోటీలను ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి స్వాగతం పలుకుతూ అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించి గ్రామానికి మండలానికి జిల్లా స్థాయిలో మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. గ్రామీణ స్థాయిలో పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు వాటి అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వ సహాయం వే?చ్చించడం జరుగుతుంద న్నారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడంతోపాటు మెరుగైన విద్యను అందించే విధంగా ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని తద్వారా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించడం జరుగుతుందన్నారు. మూడు



రోజులపాటు నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలలో విద్యార్థులు మంచి ప్రతిభను కనబరచాలని బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు, బోధన్ ఆర్డిఓ విజయకుమారి, బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రావు, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుల అమలులో జిల్లా అధికారుల నిర్లక్ష్యం!

సిరికొండ 532 సర్వే నంబర్ భూములు, అంకాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్, నవంబర్ 12 జనం సాక్షి:

కోర్టు ధిక్కరణకు పాల్పడిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి శిక్ష పడటం సరైనదేనని, అయితే న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నిజామాబాద్ జిల్లా స్థాయి అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ప్రైవేట్ వైద్యానికి సంబంధించి ఇచ్చిన తీర్పు అమలుతో పాటు సిరికొండ మండలంలోని 532 సర్వే నంబర్ భూములు, ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ విషయంలో హైకోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఈ అంశాలపై గురువారం నిజామాబాద్‌లోని ఎన్ఆర్ భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జిల్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిరికొండ 532 సర్వే నంబర్ భూముల సమస్యను పరిష్కరించాలి

సిరికొండ మండల కేంద్రంలోని 532 సర్వే నంబర్‌కు సంబంధించిన భూములకు 2009లో పట్టాలు జారీ చేశారని, ఈ భూముల విషయంలో బాధితులు న్యాయపోరాటం చేయగా 2012లో కోర్టు లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని నాయకులు తెలిపారు. అయినప్పటికీ, తీర్పు వెలువడి ఇన్నేళ్లు గడుస్తున్నా జిల్లా స్థాయి అధికారులు దానిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అంకాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అవకతవకలు

ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ప్రభుత్వం నిర్మించిన 96 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 92 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు కేటాయించి, మిగిలిన నాలుగు ఇళ్ల పంపిణీని నిలిపివేశారని తెలిపారు. కేటాయించిన 92 ఇళ్లలో 22 మంది అనర్హులు ఉండటంతో పాటు సంబంధిత గ్రామానికి చెందని వారికి కూడా ఇళ్లు కేటాయించారని బాధితులు ఆరోపిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన మరో నలుగురికి ఇళ్లు కేటాయించకుండా నిలిపివేయడంతో వారు హైకోర్టును ఆశ్రయించారని వివరించారు. దీనిపై స్పందించిన హైకోర్టు అర్హులైన నలుగురికి తక్షణమే ఇళ్లు కేటాయించాలని, ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించినప్పటికీ అధికారులు ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదని విమర్శించారు. న్యాయస్థానం ఆదేశాలను సైతం పట్టించుకోకపోవడం న్యాయవ్యవస్థను అవమానించడమేనని అన్నారు.

అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఒకవైపు కోర్టు ధిక్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న ప్రభుత్వాలు, మరోవైపు కోర్టు తీర్పులను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న జిల్లా స్థాయి అధికారుల విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నాయని నాయకులు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులను తక్షణమే అమలు చేయాలని, సిరికొండ 532 సర్వే నంబర్ భూముల సమస్యను పరిష్కరించాలని, అంకాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనర్హులకు కేటాయించిన ఇళ్లపై చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన నలుగురికి వెంటనే ఇళ్లు కేటాయించాలని, కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి వి. ప్రభాకర్, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి. దేవారం, జిల్లా నాయకులు ఆర్. రమేష్ మాట్లాడారు. జిల్లా నాయకులు ఎం. ముత్తెన్న, ఆర్మూర్ మండల సంయుక్త కార్యదర్శి బి. కిషన్, వి. సత్తెవ్వ, ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. బాబన్న, ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్. దామోదర్, పీవైఎల్ మండల నాయకులు టి. నరేష్‌తో పాటు సిరికొండ, అంకాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు, బాధితులు ఎం. పండరి, జహీరాబీ, ఎం. సుశీల, ఒడ్డె నాగయ్య, ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



నాణ్యతతోనే మనుగడ సాధ్యం

- ప్రతి ఉద్యోగి నాణ్యతకు కట్టుబడి ఉండాలి..
- ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్..
- క్వాలిటీ జీఎం (ఆర్జీ రీజియన్) జె.వెంకటరమణ..



గోదావరిఖని, **(జనంసాక్షి):**
సింగరేణి రామగుండం ఏరియా-1 జీఎం కార్యాలయం నందు క్వాలిటీ విభాగం ఆధ్వర్యంలో "బొగ్గు నాణ్యత వారోత్సవాలు 2026" (12-11-2026 నుండి 18-11-2026 వరకు) ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ మరియు క్వాలిటీ జీఎం (ఆర్జీ రీజియన్) శ్రీ జె.వెంకటరమణ గార్లు హాజరై క్వాలిటీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అందరికి క్వాలిటీ అవగాహన కరపత్రాలను పంపిణీ చేసి ఉద్యోగులందరిచే ప్రతిజ్ఞ చేయించడం జరిగినది.ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ మార్కెట్‌లో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం ద్వారానే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. గనుల్లో బొగ్గు వెలికితీసే సమయంలో బండ, మట్టి, షేల్ లేయర్లను వేరుచేస్తూ మంచి గ్రేడ్ బొగ్గును లోడింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే జిడికె-2ఏ భూగర్భ గనిలో షేల్ లేయర్‌ను వేరు చేస్తూ నాణ్యతను పెంచుకున్నారని, అలాగే జిడికె-1 ఇంక్లైన్‌లో మంచి నాణ్యత గల బొగ్గును అందిస్తుండటంతో స్థానిక వినియోగదారులు పోటీపడి మరీ రోజుకు సుమారు 500 టన్నుల బొగ్గును కొనుగోలు చేస్తున్నారని అభినందించారు. ప్రతి పని ప్రదేశంలో సూపర్‌వైజర్ నుండి షావెల్ ఆపరేటర్ వరకు అందరూ సమష్టి కృషితో తమ బాధ్యతలను నిర్వర్తిస్తేనే నాణ్యత ప్రమాణాలను మరింత పెంచగలమని పేర్కొన్నారు. అనంతరం ఆర్జీ రీజియన్ క్వాలిటీ జీఎం వెంకటరమణ మాట్లాడుతూ ప్రైవేటు బొగ్గు ఉత్పత్తి సంస్థలు తక్కువ ధరలకు బొగ్గును విక్రయిస్తున్న నేపథ్యంలో, తీవ్రమైన మార్కెట్ పోటీని తట్టుకుని వినియోగదారులను కాపాడుకోవాలంటే నాణ్యత ఒక్కటే మార్గమని, క్షేత్రస్థాయి నుండి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిడికే 1,3, 2,2ఏ, ఓసి. ఫైవ్, జీడికే 11 ఇంక్లైన్ గనులు, డిపార్ట్‌మెంట్ లలో "బొగ్గు నాణ్యత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కె. చంద్రశేఖర్, ఏజీఎం (ఈ అండ్ ఎం) కాశీ విశ్వేశ్వరరావు, యస్.ఓ.యం (క్వాలిటీ) బ్రహ్మాజీ రావు, డీజీఎం (ఫైనాన్స్) ధనలక్ష్మి బాయి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులు మోహన్ రావు, కర్ణ, వేణు, సురేష్, సి.ఎం.ఓ.ఏ.ఐ (సీఎంవో ఏ ఐ) ప్రతినిధి క్రాంతి కుమార్, ఏఐటీయూసీ ప్రతినిధి ఇజ్జగిరి రాజు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వడ్లను కొనుగోలు చేయాలని ఎమ్మార్వో కు వినతి

ముస్తాబాద్ నవంబర్ 12(జనంసాక్షి)
ముస్తాబాద్ మండల ఎమ్మార్వో ఎండి ఫారుక్ కు కలిసి రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు చేయకపోవడం వరి కోతలు ప్రారంభించి నెల రోజులు దాటుతున్న ఇప్పటివరకు వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన గతంలో కురిసిన వర్షానికి వరి ధాన్యం మొలకలు రావడం జరిగింది అదేవిధంగా ఎండిన వడ్ల మ్యాచార్ 11 నుండి 12 వరకు రావడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని చెప్పి వివిధ గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళల్లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి సన్న వడ్లను కొనుగోలు చేసి 500 రూపాయలు బోనస్ ఇవ్వాల్సిందిగా కోరడమైనది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముస్తాబాద్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్, చికోడు గ్రామ సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, గన్నెవారిపల్లి సర్పంచ్ రఘు, దోనుకుల కరుణాకర్ , పాల్గొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వరి ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్ఐ కుమార్, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.



విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించండి

ఎన్పీడీసీఎల్ డీఈ వెంకటరమణ..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి)
వేములవాడ డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిల వసూలే లక్ష్యంగా పట్టణంలో గురువారము పోల్ టు పోల్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఎన్పీడీసీఎల్ డీఈ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకు పోవడంతో వాటి వసూలు కోసం అధికారుల ద్వారా పోల్ టు పోల్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిషన్ పరిధిలో కమర్షియల్ కేటగిరీతో పాటు వివిధ వర్గాల నుంచి రావాల్సిన డిమాండ్‌కు తగినట్లుగా వసూళ్లు లేకపోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోందన్నారు.ప్రతి నెల డిమాండ్ సుమారు రూ 5 కోట్లు ఉంటే కేవలం రూ 2.5 కోట్లు మాత్రమే వస్తోందన్నారు. అయినప్పటికీ మేనేజ్‌మెంట్ సహకారంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం,సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల పనులను ముమ్మరంగా చేపడుతున్నామని స్పష్టం చేశారు. బకాయిల వసూళ్ల కోసం వేములవాడ పట్టణ పరిధిలో సుమారు 50 మంది సిబ్బందితో పోల్ టు పోల్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇంటింటికీ తిరిగి భారీగా బకాయిలున్న వినియోగదారుల విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని, బకాయిలు చెల్లించిన వెంటనే అదే రోజు కనెక్షన్ పునరుద్ధరిస్తామని తెలిపారు. విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి వినియోగదారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏడి గంగాధర్, ఏఈ సిద్ధార్థ, లైను ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రుద్రంగి నూతన పెన్షన్ దారులకు ప్రొసీడింగ్ పత్రాల అందజేత

వేములవాడలో ఘనంగా పంపిణీ కార్యక్రమం

రుద్రంగి నవంబర్ 12 (జనం సాక్షి)
రుద్రంగి మండలానికి చెందిన నూతన పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ ప్రొసీడింగ్ పత్రాలను వేములవాడ పట్టణంలోని ఆర్య వైశ్య సత్రంలో బుధవారం ఘనంగా అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కలిసి ఆయన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఎవరూ పెన్షన్ కు దూరం కాకూడదని, అర్హత ఉన్నా ఇంకా పెన్షన్ రాని వారు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. పెన్షన్ డబ్బులను సకాలంలో అందజేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.కలెక్టర్ గరీమా అగర్వాల్ మాట్లాడుతూ, పెన్షన్ మంజూరు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, ఎంపీడీవో నటరాజ్, రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, మాజీ జెడ్పిటిసి గట్ల మానయ్య, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుండ్లపల్లి ఎక్స్ రోడ్‌లో రేషన్ షాప్ ప్రారంభం



గన్నేరువరం, నవంబర్ 12 (జనంసాక్షి):
గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామంలోని రేషన్ షాపుకు అనుబంధంగా గుండ్లపల్లి ఎక్స్ రోడ్‌లో ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాప్ బ్రాంచ్‌ను గురువారం సర్పంచ్ చింతల ఉమా రాణి - అనిల్ కుమార్, ఎంపీడీవో శ్రీ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గుండ్లపల్లి ఎక్స్ రోడ్ ప్రాంత ప్రజలు రేషన్ కోసం దూరం వెళ్లకుండా, తమ ప్రాంతంలోనే సరుకులు అందుకోవాలనే ఉద్దేశంతోనే ఈ బ్రాంచ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో, పారదర్శకంగా రేషన్ సరుకులు అందేలా చూస్తామని పేర్కొన్నారు.ఈ బ్రాంచ్ ఏర్పాటుతో స్థానిక రేషన్ లబ్ధిదారులకు తమ ప్రాంతంలోనే రేషన్ సరుకులు పొందే సౌకర్యం కలిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంగల జ్యోతి - సత్యనారాయణ రెడ్డి, వార్డు సభ్యులు పంబాల రాజు, పంబాల సారవ్వ - ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రాకేష్, రేషన్ షాప్ డీలర్ చాడ బాపి రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ను పరామర్శించిన వేములవాడ అర్బన్

బిఆర్ఎస్ సర్పంచ్‌లు..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి)
ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసుకు బుధవారం కాలికి గాయం అయినా విషయం విధితమే. గురువారము వేములవాడ అర్బన్ మండల పరిధిలోని బిఆర్ఎస్ సర్పంచ్‌లు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలన్నారు.పరామర్శించిన వారిలో రెడ్డవేణి పరశురామ్,ఉరడి సునీత రాజిరెడ్డి,ముత్త సంజన మహేష్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు కొండాపూర్ విద్యార్థిని

సిరికొండ, నవంబర్ 12 జనంసాక్షి:
మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బి. పల్లవి రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైంది. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మేడ్చల్?మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పల్లవి నిజామాబాద్ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.ఈ విషయాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ వెల్లడించారు. విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు పల్లవిని అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.





ఉత్తమ ఉర్దూ జర్నలిస్టుగా ముహమ్మద్ అబ్దుల్ హకీంకు అవార్డు

- మౌలానా అబుల్ కలాం ఆజాద్ మెమోంటోతో పాటు ప్రశంసాపత్రం అందజేత

సుల్తానాబాద్,నవంబర్ 12(జనంసాక్షి) :

హైదరాబాద్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టి యు డబ్ల్యు జేయు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జర్నలిజం రంగంలో ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులకు, ఉత్తమ జర్నలిస్టులకు,సంఘ సేవకులకు అవార్డులు ప్రదానం చేశారు.పెద్దపల్లి జిల్లా నుంచి రహనుమా-ఏ-దక్కన్ ఉర్దూ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ ముహమ్మద్ అబ్దుల్ హకీంకు ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు సంఘ సేవకులుగా గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు మౌలానా అబుల్ కలాం ఆజాద్ మెమోంటోను నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ చేతుల మీదుగా అందజేశారు.ఈ అవార్డు లభించడం పట్ల జర్నలిస్టు వర్గాలు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ముహమ్మద్ అబ్దుల్ హకీంకు అభినందనలు తెలిపారు.

లయన్ డాక్టర్ రేకులపల్లి విజయ కి అరుదైన గౌరవం

- మాతృసవనం సన్మానం



సుల్తానాబాద్,నవంబర్ 12(జనంసాక్షి) :

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి 70,వ తిరునక్షత్ర మహోత్సవాల (యతీంద్ర సప్తతి) సందర్భంగా ప్రదానం చేసిన ప్రధాన పురస్కారం అయిన మాతృసవనం సన్మానం రేకులపల్లి విజయకు అరుదైన గౌరవం దక్కింది. సమాజ సేవలో విశేష కృషి చేసిన వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతిభావంతులకు మాతృమూర్తులకుఈ అత్యంత ప్రతిష్టాత్మకంగా,ప్రత్యేక గౌరవాన్ని అందించారు. బుధవారం హైదరాబాదులో ముచ్చింతలోని స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ లో జరిగిన కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మాతృ సవనం అవార్డుతో శ్రీవాణి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లయన్ రేకులపల్లి విజయ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక డైరెక్టర్ రేకులపల్లి సుష్మ ,ప్రిన్సిపల్స్ బండారి కమలాకర్ బాలసాని శ్రీనివాస్, అధ్యాపక బృందం విజయ కు అవార్డు రావడం మన ప్రాంతానికి శ్రీవాణి విద్యాసంస్థలకు దక్కిన అరుదైన,గౌరవం అని గర్వ కారణం అన్నారు. విజయ రానున్న రోజులలో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని పలువురు కోరారు.

నూతన కార్యవర్గానికి అభినందనల వెల్లువ



సుల్తానాబాద్,నవంబర్ 12(జనంసాక్షి) :

గురువారం లారీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా, అధ్యక్షునిగా పల్లెర్ల సంపత్, ఉపాధ్యక్షునిగా మోయిజ్,ప్రధాన కార్యదర్శిగా బోయిరి రాకేష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా తోట సంపత్,కోశాధికారిగా ఒ రై అజయ్ లు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించగా,లారీ అసోసియేషన్ కార్యాలయం ముందు నూతన కార్యవర్గాన్ని జాపతి రాజిరెడ్డి తో పాటు కందునూరి కుమార్ సాజిద్ అంజయ్య తదితరులు అభినందించారు.అనంతరం ఘనంగా శాలువాతో సన్మానించారు.



చిన్నారి కల నెరవేర్చిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

- మాట ఇచ్చిన 36 గంటల్లోనే విద్యార్థినికి సైకిల్ బహుమతి!

ఎలిగేడు,నవంబర్ 12(జనంసాక్షి) : విద్యార్థినికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తన ప్రత్యేకతను చాటుకున్నారు. హామీ ఇచ్చిన కేవలం 36 గంటల్లోనే ఐదో తరగతి విద్యార్థిని సాయి విజ్ఞతకు సైకిల్‌ను బహుమతిగా అందజేశారు. ఇటీవల ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపీ వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన రీడింగ్ కాంపిటీషన్‌లో మొదటి బహుమతి సాధించిన ఐదో తరగతి విద్యార్థిని సాయి విజ్ఞత ప్రతిభను అభినందించిన ఎంపీ, ఆమెకు సైకిల్ బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం కేవలం 36 గంటల్లోనే సైకిల్‌ను అందజేసి చిన్నారి కలను నెరవేర్చారు. సైకిల్ అందుకున్న సాయి విజ్ఞత ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.మాట నిలబెట్టుకున్న ఎంపీ వంశీకృష్ణకు పాఠశాల ఉపాధ్యాయులు, సాయి విజ్ఞత తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీసీ గురుకులంలో జిల్లాస్థాయి ఘనంగా క్రీడా పోటీలు

సుల్తానాబాద్,నవంబర్ 12(జనంసాక్షి) :

మండలంలోని భూపతిపూర్, బీసి బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి.అండర్ 17 విభాగంలో జరిగే ఈ క్రీడా పోటీలకి జిల్లాలోని వివిధ జ్యోతిబాపూలే పాఠశాలల నుండి విద్యార్థులు వచ్చి వివిధ క్రీడాంశాలలో పాల్గొననున్నారు.క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం జరిగింది.క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుల్తానాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రకుమార్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో చంద్రకుమార్ మాట్లాడుతూ, క్రీడలు రాష్ట్ర దేశ సమగ్రతకు అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థులు జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి వరకు క్రీడాంశాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడాంశాల్లో ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో కూడా ఉజ్జల భవిష్యత్తు ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన భూపతిపూర్ సర్పంచ్ పోచంపల్లి చిన్నయ్య మాట్లాడుతూ, విద్యార్థులు ఓటమిని గెలుపును సమానంగా భావించాలని గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హెన్రీ, వైస్ ప్రిన్సిపల్ సంతోష్ కుమార్, డిప్యూటీ వార్డెన్ ప్రమోద్ కుమార్ , ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల క్రీడ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి



ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏకలవ్య పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం రూ.6 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా పాఠశాల నుంచి మాక్లూర్ తండా వరకు రహదారి నిర్మాణంతో పాటు ఈ ప్రాంతంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం మరో రూ.11 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు.పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది విజ్ఞప్తి మేరకు విద్యార్థులకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించేందుకు నాలుగు ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలించి, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

విద్యార్థులు విద్యలోనే కాకుండా కళలు, సంస్కృతి, క్రీడలు, సామాజిక సేవ వంటి వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ఇందల్వాయి చింతల కిషన్ బద్దం రెడ్డి సుజాత శ్రీనివాస్ నల్లవెల్లి గంగారెడ్డి ఎల్ఐసి గంగాధర్ గంగారం తండా సర్పంచ్ సంగీత దిలీప్ తదితరులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఉపసర్పంచ్,వార్డు సభ్యులు

- రైతన్నలు అందరూ సహకరించాలి - ఎల్మినో అనేది ప్రకృతి విపత్తు

- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

పెద్దపల్లి నవంబర్ 12(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామ మాజీ ఉప సర్పంచ్ కల్వల సంపత్, వార్డు సభ్యులు కల్వల శ్రీలత రామరాజు,వార్డు సభ్యులు రాజేశంగౌడ్,వార్డు సభ్యులు మిట్టపల్లి మహేశ్వరి రాజేశం,కల్వల లచ్చయ్య, కల్వల సదానందం,తగరం జయరాజు,కల్వల రాజేశం,తగరం కోటేశ్,తగరం కమల్,తగరం వంశీ,కల్వల సంపత్,కల్వల విష్ణుష్,కల్వల లచ్చయ్య,కల్వల శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు. అనంతరం పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.పెద్దపల్లి మండలంలోని బొంపల్లి, మెరపల్లి,కాసులపల్లి, పాలితం,గోపయ్యపల్లి,కాపులపల్లి మరియు కనగర్తి గ్రామాల్లో సింగిల్ విండో మరియు ఐకెపి వారి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు , ప్రజా ప్రభుత్వ పాలనకు మెచ్చి పలువురు ఇతర పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందని అన్నారు.ఎల్మినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గి ఎండ తీవ్రత పెరిగి సాగునీరు కొరత ఏర్పడుతుందని దానికి అనుగుణంగా రైతన్నలు ఎప్పుడూ పండించే వరి సాగు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఎల్ నినో అనేది ప్రకృతి విపత్తు అని దాన్ని ప్రతిపక్షాలు ఆసరాగా తీసుకొని రాజకీయం చేస్తున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. ప్రజలు మరియు రైతన్నలు అందరూ ఎల్మినో విపత్తు విషయంలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచ్ లు ప్రజా ప్రతినిధులు,పెద్దబొంకూరు నాయకులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.